## క్లుప్తంగా

### ‘మోడల్’లో ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

నెల్లికుదురు : స్థానిక మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.ఉపేందర్‌రావు అన్నారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అడ్మిషన్ల కోసం ఇంటర్ ఫస్టియర్, 6, 7వ తరగతిలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నవారు, చేసుకోని వారు అందరు అర్హులేనన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ ఫస్టియర్‌లో సీట్ల కోసం సంప్రదించాలని కోరారు. దూరప్రాంతాల విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం ఉందన్నారు. స్పాట్ అడ్మిషన్ల కోసం 9912503414 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### అన్నదానం

మహబూబాబాద్ రూరల్ : ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా భక్తులకు మంగళవారం అన్నప్రసాదం పంపిణీ చేశారు. పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయం వద్ద దాతలు, ఐవీఎఫ్ బాధ్యులు అమ్మవారికి పూజలు చేసి భక్తులకు అన్నప్రసాదం పంపిణీ ప్రారంభించారు.

### సమస్యల పరిష్కారానికి ‘వాట్సాప్ చాట్ బాట్’

నెహ్రూసెంటర్ : విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా అధికారులకు తెలియజేయవచ్చని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ జలగం నరేష్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను వాట్సాప్ ద్వారా తెలియజేయవచ్చని, అధికారులు స్పందించి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడుతారని పేర్కొన్నారు. సమస్యలను తెలియజెప్పేందుకు వాట్సాప్ నెంబర్. 7901628348, వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. టీజీఎన్‌పీడీసీఎల్.కామ్‌లో చాట్ చేయవచ్చని పేర్కొన్నారు. టోల్‌ఫ్రీ 1912 నంబర్ ద్వారా కూడా సమస్యల సేవలను పొందవచ్చన్నారు.

### అధిక ధరలకు అమ్మితే చర్యలు



ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న ఏఓ వినయ్‌కుమార్, పీఎస్సై షేక్ ఖాదర్ పాషా

నర్సింహులపేట: రైతులకు విత్తనాలు, ఎరువులు ఎమ్మార్పీ కంటే ఎక్కువగా అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఏఓ వినయ్‌కుమార్, పీఎస్సై షేక్ ఖాదర్ బాషా హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో ఫెర్టిలైజర్, ఫెస్టిసైడ్స్ షాపులను వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులు కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపుల్లో స్టాక్ రిజిష్టర్‌ను, ఎరువులను, స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రామాల్లో ఎవరైన అనుమతి లేకుండా విత్తనాలు అమ్మితే సమాచారం అందించాలన్నారు.

### విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



తొర్రూరు రూరల్ : ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ పాడిగేదె మృతి చెందిన సంఘటన మండలంలోని కంఠాయపాలెంలో మంగళవారం చోటు చేసుకుంది. కావటి అరవింద్‌కు చెందిన పాడిగేదె రోజువారీ మేతకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామంలోకి వచ్చిన తర్వాత వీధిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్‌కు పాడిగేదె తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది.

### ఆర్థికసాయం

కురవి : మండలంలోని రాజోలు శివారు హర్యతండాలో యువకులకు క్రికెట్ కోసం డోర్నకల్‌కు చెందిన విజయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాలోత్ రామారావు మంగళవారం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించడంతోపాటు చదువుకోవాలని సూచించారు.

### టీబీతో భయం వద్దు



టీబీ రోగులకు కిట్లు అందజేస్తున్న వైద్యులు

దంతాలపల్లి : టీబీ సోకిన వారు భయపడవద్దని వైద్యులు చైతన్య, కవిత అన్నారు. టీబీ ముక్త భారత్‌లో భాగంగా స్థానిక ప్రజావైద్యశాలలో మంగళవారం టీబీ రోగులకు ఎండీఆర్ పోషణ, న్యూట్రిషియన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీబీ భయపడే జబ్బుకాదని, క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నుంచి బయట పడడం చాలా సులువు అన్నారు. దాత కీర్తి కుమార్, సూపర్‌వైజర్ సుజాత,టీబీ నోడల్ పర్సన్ చలపతిరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కాంటాలు పూర్తయినా.. కదలని ధాన్యం

- నెలరోజులుగా రైతుల పడిగాపులు
- గన్నీ సంచులు లేక, లారీలు రాక ఇబ్బందులు

కేసముద్రం : ఆరుగాలం శ్రమించిన అన్నదాతలు తీరా పండించిన ధాన్యాన్ని అమ్ముకుందామంటే తిప్పలు తప్పడం లేదు. ఒక పక్క గన్నీసంచులు లేక, మరో పక్క కాంటాలు పూర్తయినా లారీలు రాకపోవడంతో నెలరోజులుగా రైతులు పడిగాపులు పడుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేసముద్రం పీఏసీఎస్ ఆధ్వర్యంలో 7 సెంటర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిల్లో 3 సెంటర్‌లను ఇప్పటికే క్లోజ్ చేశారు. మిగిలిన ఇనుగుర్తి 1, 2 వ సెంటర్లు, తాళ్లపూసపల్లి, కల్వల సెంటర్లలో కొనుగోళ్లు నడుస్తున్నాయి. అయితే రైతులు అమ్మకానికి తీసుకొచ్చిన ధాన్యం సెలక్ట్ అయినప్పటికీ, గన్నీసంచులను ఇవ్వలేదు. ట్రాక్టర్ కిరాయిలు భరించలేని రైతులు, కాంటాలు పూర్తయిన లాట్‌ల వద్దే పడిగాపులు పడుతున్నారు. మరోవైపు గన్నీసంచులు ఇచ్చినప్పటికీ, లారీలు రాకపోవడంతో కాంటాలు పెట్టుకోవడానికి మరికొందరు రైతులు ముందుకు రావడంలేదు. ఎందుకంటే వర్షం పడితే మళ్లీ కాంటా అయిన బస్తాల్లోని వడ్లను ఆరబోసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇనుగుర్తి 1వ సెంటర్‌లో 8 వేల బస్తాలకు కాంటాలు పూర్తికాగా, ఇనుగుర్తి 2వ సెంటర్‌లో 5వేల బస్తాలకు, కల్వల సెంటర్‌లో 1,600 బస్తాలు, తాళ్లపూసపల్లిలో 1,400 బస్తాలకు కాంటాలు పూర్తయ్యాయి. ఇప్పటికైనా లారీలు ఏర్పాటు చేసి కాంటాలు పూర్తయిన బస్తాలను మిల్లులకు రవాణా చేయాలని రైతులు వాపోతున్నారు.



ఇనుగుర్తి సెంటర్‌లో కాంటాలు పూర్తయిన బస్తాలను లాట్‌లుగా వేసుకున్న రైతులు



గన్నీసంచులు ఇచ్చినా కాంటా పెట్టకుండా ధాన్యాన్ని ఆరబోసుకున్న రైతు

### నెలరోజులు అయితాంది..



మా గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు సెంటర్‌లో పండించిన వడ్లను అమ్ముకుందామని వచ్చినం, మా వడ్లు సెలక్ట్ అయినప్పటికీ గన్నీసంచులు ఇయ్యలేదు. లొల్లి చేస్తే ఇచ్చిండ్రు. కాంటాలు పెట్టాం. నెలరోజుల నుంచి సెంటర్‌లోనే వడ్ల దగ్గర పడిగాపులు పడుతూ ఇబ్బందులు పడ్డాం.

– జి.యాకయ్య, ఇనుగుర్తి

### కాంటాలు పెట్టలేదు



పండించిన ధాన్యం అమ్ముకుందామని ఇనుగుర్తి సెంటర్‌కు వచ్చినం. ధాన్యాన్ని సెలక్ట్ చేసినప్పటికి, గన్నీ సంచులు ఇవ్వకపోవడంతో వడ్లను రాశిగా పోసుకున్నం. కాంటాలైన బస్తాలు తడిస్తే మళ్లీ బస్తాల్లో నింపిన వడ్లను ఆరబోసుకోవాల్సి వస్తుంది. ఆ తిప్పలు పడలేకనే పరదాలో వడ్లను ఆరబోసుకున్నం. లారీలు వచ్చినప్పుడే మా వడ్లకు కాంటాలు పెట్టిస్తాం.

– భూక్య వీరన్న, అయ్యగారిపల్లి

### లారీల కొరత ఉంది

కేసమద్రం పీఏసీఎస్ పరిధిలో 7 సెంటర్లలో 3 క్లోజ్ చేశాం. ఇంకా 4 సెంటర్‌లలో సుమారు 20 వేల బస్తా ఉంది. లారీల కొరత కారణంగానే, కాంటాలు పూర్తయిన బస్తాలను తరలించలేకపోతున్నం. పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి, రెండు, మూడు రోజుల్లో లారీలు వచ్చేలా చూస్తాం.

– ఎల్లయ్య, సీఈఓ

# అభివృద్ధికి రూ.1.25 కోట్లు మంజూరు

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కిషన్



నిధుల మంజూరు పత్రాలను చూపుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కిషన్

కేసముద్రం: ఇనుగుర్తి మండల అభివృద్ధికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తన నిధుల నుంచి రూ.1.25 కోట్లను మంజూరు చేసినట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వద్దిరాజు కిషన్ తెలిపారు. మంగళవారం ఇనుగుర్తిలో ఎంపీ రవిచంద్ర ఆవిష్కరించిన నిధుల మంజూరీ పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇనుగుర్తికి రూ.20 లక్షలు, చిన్ననాగారం గ్రామానికి రూ.20 లక్షలు, కోమటిపల్లికి రూ.25 లక్షలు, తారాసింగ్‌తండా జీపీకి రూ.20 లక్షలు, చిన్నముప్పారం గ్రామానికి రూ.15 లక్షలు, మీట్యాతండాకు రూ.10 లక్షలు, పెద్దతండాకు రూ.5 లక్షలు, లక్ష్మీపురం గ్రామానికి రూ.5లక్షలు, పాతతండాకు రూ.5 లక్షలు కేటాయించారని ఆయన అన్నారు. ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు నిధులల మంజూరీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎంపీ రవిచంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కేసముద్రం పీఏసీఎస్ చైర్మన్ దీకొండ వెంకన్న, బీఆర్ఎస్ గ్రామపార్టీ అధ్యక్షుడు బేతమళ్ల చంద్రయ్య,వెంకన్న, తొర్రూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ కసరబోయిన విజయ్ యాదవ్, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి




మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు శ్రీనివాసరావు

గార్ల: ఇల్లులేని నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కోసం అధికారులు పలుమార్లు సర్వే చేసి జిల్లా అధికారులకు నివేదిక అందజేసినా మండలంలో నేటికీ ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితా ప్రకటించకపోవడంలో మతలబు ఎంటో అర్థం కావడం లేదన్నారు. గ్రామాల్లో అర్హులైన ఇళ్లులేని నిరుపేదలను పార్టీలకతీతంగా ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు పెద్ద వెంకటేశ్వర్లు, జి రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాంటేషన్ నిర్మాణం విరమించుకోవాలి



మాట్లాడుతున్న శ్యాంసుందర్ శర్మ

మహబూబాబాద్ అర్బన్ : మానుకోటలో ముత్యాలమ్మ గుడి సెంటర్‌లో మున్సిపల్ అధికారులు నూతనంగా ఏర్పాటు చేయనున్న ప్లాంటేషన్ నిర్మాణాన్ని విరమించుకోవాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్యాంసుందర్ శర్మ డిమాండ్ చేశారు. ముత్యాలమ్మగుడి సెంటర్‌ను బీజేపీ నాయకులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్‌శర్మ మాట్లాడుతూ మానుకోట జిల్లా కేంద్రంలో ప్లాంటేషన్ల నిర్మాణం చేపట్టాలంటే పట్టణ ప్రజలు, నాయకులతో విచారించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నిర్మాణం చేపట్టాలన్నారు. వారి వెంట బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు గద్దం అశోక్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు అజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

# కుళ్లిన గుడ్ల పంపిణీ



కుళ్లిన గుడ్లను చూపుతున్న లబ్ధిదారులు

డోర్నకల్ : మండలంలోని కస్నాతండా అంగన్‌వాడీ కేంద్రంలోని పలువురు లబ్ధిదారులకు కుళ్లిన గుడ్లను పంపిణీ చేయడం స్థానికంగా కలకలం రేపింది. అంగన్‌వాడీ కేంద్రం నుంచి నాలుగు రోజుల క్రితం బాలింతలు, గర్భిణులకు కోడిగుడ్లను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని బోడమాంజ్యాతండాకు చెందిన పలువురు లబ్ధి దారుల కోడిగుడ్ల వినియోగించే క్రమంలో గుడ్లు కుళ్లిపోయి దుర్వాసన వస్తుండటం, ఉడకబెట్టిన గుడ్ల నుంచి పురుగులు రావడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడ్లపై ప్రభుత్వ ముద్ర కూడా సక్రమంగా లేదని, తమకు నాసిరకం గుడ్లను సరఫరా చేసి తమ ఆరోగ్యాలతో ఆడుకుంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సీడీపీఓ లక్ష్మిని వివరణ కోరగా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయిన గుడ్లను వెంటనే లబ్దిదారులకు సరఫరా చేశామని, కుళ్లిన గుడ్ల సరఫరాపై విచారణ జరుపుతామని తెలిపారు.

# మరో పోరాటానికి కమ్యూనిస్టులు సన్నద్ధం కావాలి



శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న సాగర్

మరిపెడ : మరో పోరాటానికి కమ్యూనిస్టులు సన్నద్ధం కావాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి.సాగర్ పిలుపునిచ్చారు. మరిపెడలో జరుగుతున్న రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకున్నా నేటికి కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అలువాల వీరయ్య, గునిగంటి రాజన్న, సోమయ్య, ఉపేందర్, శ్రీనివాస్, మధుసూదన్, రాజన్న, వీరన్న, లచ్చయ్య, రాజశేఖర్, రమేష్, మమత తదితరులు పాల్గొన్నారు.

# మహిళకు గాయాలు

డోర్నకల్ : మండలంలోని మల్లాయికుంటతండా శివారు దాన్యాతండాలో ప్రమాదవశాత్తు ఓ మహిళ డాబా పైనుంచి పడి గాయాలపాలైంది తండాకు చెందిన బానోత్ జయమ్మ మంగళవారం ఉదయం డాబాపై వేపపుల్ల కోసం చెట్టు కొమ్మను పట్టుకునే ప్రయత్నంలో డాబాపై నుంచి పడడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు.

# యూట్యూబ్ జర్నలిస్ట్‌పై చర్య తీసుకోవాలి



టౌన్ ఎస్సై విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు అందజేస్తున్న ముస్లింలు

మహబూబాబాద్ రూరల్ : యూట్యూబ్ జర్నలిస్ట్ చిలక ప్రవీణ్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణ ముస్లింలు టౌన్ పోలీసు స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్ద మహమ్మద్ ఇక్బాల్ మాట్లాడుతూ యూట్యూబ్ జర్నలిస్ట్ చిలక ప్రవీణ్ ఇస్లాం మతం, పవిత్ర ప్రవక్త హజ్రత్ మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. చట్టపరంగా వెంటనే ప్రవీణ్‌ను అరెస్ట్ చేసి, సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఫరీద్, ముఫ్తీ ఆలంగిర్, అబ్దుల్ హమీద్, సయ్యద్ అహ్మద్ రిజ్వీ, మహమ్మద్ వాహెద్ , అసద్ అలీ ఖాన్, ఫజల్, షేక్ చాంద్, సాబీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

# అభివృద్ధికి నోచుకోని విలీన గ్రామాలు



మాట్లాడుతున్న నవీన్

మహబూబాబాద్ అర్బన్ : మానుకోట మున్సిపల్ పరిధిలో విలీనమైన జమాండ్లపల్లి ఐదేళ్ల నుంచి అభివృద్ధికి నోచుకోవడం లేదని కాంగ్రెస్ జవహర్ బాల్ మంచ్ జిల్లా అధ్యక్షుడు పిట్టల నవీన్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. జమాండ్లపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం మానుకోట పట్టణంలో జమాండ్లపల్లి, ఈదులపూసపల్లి, గాంధీపురం, అనంతారం, శనిగపురం, బేతోలు గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేశారన్నారు. అధికారులు, వార్డు కౌన్సిలర్లు, ఎమ్మెల్యే అభివృద్ధి చేయడంలో చిన్న చూపు చూశారన్నారు. ఎంపీ బలరాంనాయక్ ఆధ్వర్యంలో విలీన గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ యూత్ నాయకులు ప్రవీణ్, శివ, చందు, మహేష్, అజయ్, రంజిత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన నెహ్రూ



మహబూబాబాద్ రూరల్ : నెహ్రూ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



గార్లలో నివాళులర్పిస్తున్న కృష్ణగౌడ్

మహబూబాబాద్ రూరల్ : భారత దేశాన్ని మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ అభివృద్ధి పథంలో నడిపించారని కాంగ్రెస్ ఎస్టీ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ గుగులోత్ వెంకట్ నాయక్ అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ 61వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని, గార్లలోని నెహ్రూ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీరుటి లక్ష్మినారాయణ, రామగోని రాజుగౌడ్, ఎండీ.హారుణ్, పోతురాజు రాజు, కొత్త ఇంద్రారెడ్డి, పద్మం ప్రవీన్, గార్ల కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్, మాజీ ఎంపీపీ ఎం వెంకట్‌లాల్, శంషాద్‌బేగం, పి.బిక్షపతిగౌడ్, జె పృథ్వీరాజ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఫైర్‌స్టేషన్ కోసం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఇమ్మానియల్

డోర్నకల్ : డోర్నకల్‌లో ఫైర్‌స్టేషన్ భవనం కోసం కేటాయించిన స్థలాన్ని మంగళవారం తహసీల్దార్ ఇమ్మానియల్, ఫైర్ స్టేషన్ ఎస్సై వీరేశం పరిశీలించారు. అమ్మపాలెం సమీపంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు కోసం గతంలో 10 గుంటల స్థలాన్ని ఏర్పాటు చేయగా స్థల కేటాయింపుపై కొంతమంది అభ్యంతరాలు ఏర్పాటు చేస్తూ కోర్టును ఆశ్రయించారు. మరోవైపు ఫైర్‌స్టేషన్ భవన నిర్మాణానికి నిధులు కేటాయింపు జరగడంతో తహసీల్దారు, ఫైర్‌స్టేషన్ ఎస్సై అమ్మపాలెం సమీపంలో స్టేషన్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు.

# దళితులపై దాడిని ఖండించండి



మాట్లాడుతున్న చిరంజీవి

నెహ్రూసెంటర్/మహబూబాబాద్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దళితులు, మైనార్టీలపై పోలీసుల అక్రమ దాడులను ఖండించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి వంకాయలపాటి చిరంజీవి అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడతూ దళితులపై పోలీసులు దాడులు చేయడం సరికాదన్నారు. రోడ్లపై కూర్చోబెట్టి పోలీసులు దాష్టికంగా యువకులను కొట్టడం హేయమైన చర్య అని అన్నారు. సమావేశంలో డీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కూరాకుల పాల్, జిల్లా నాయకుడు గార రవిచంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

# హాస్టళ్ల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

మహబూబాబాద్ అర్బన్ : పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఎస్సీ, బీసీ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్ అన్నారు. స్థానిక బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో మంగళవారం జిల్లా అధికారి ఎం.నర్సింహారావుకు బీఎస్పీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆయన వెం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఇస్సంపెల్లి ఉపేందర్, అసెంబ్లీ అధ్యక్షుడు గుగులోత్ నరేష్‌నాయక్, నాయకులు శ్రీనివాస్, బాలు, తదితరులు ఉన్నారు.

## సంక్షిప్త సమాచారం


### అభివృద్ధే లక్ష్యం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కొమ్మాలు

గూడూరు : అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే మురళీనాయక్ పని చేస్తున్నారని జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని చెంద్రుగూడెం ఎస్సీ కాలనీలో మంగళవారం ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ. 10 లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్‌రెడ్డి, చంటి స్వామి, రసూల్, రాములు, రాంచంద్రు, శ్రీను పాల్గొన్నారు.

### యూనిఫామ్‌లు అందజేయాలి



మాట్లాడుతున్న ఏపీఎం తిలక్

మహబూబాబాద్ రూరల్ : మహిళా సంఘాల సభ్యులు ఏకరూప దుస్తులను త్వరగా కుట్టి ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేయాలని ఐకేపీ ఏపీఎం తిలక్ అన్నారు. మండల సమాఖ్య కార్యవర్గ సమావేశం మండల సమాఖ్య కార్యాలయ భవనంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పిల్లలకు సంబంధించిన స్కూల్ యూనిఫారాలు పాఠశాలల పునఃప్రారంభంలోగా స్కూల్ హెచ్‌ఎంలకు అప్పగించాలని సూచించారు.

### నల్లబెల్లం పట్టివేత

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈదులపూసపల్లి శివారులో అక్రమంగా తరలిస్తున్న క్వింటా నల్లబెల్లం, పది కిలోల పటిక, ఐదు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నామని రూరల్ ఎస్సై వి.దీపిక మంగళవారం తెలిపారు. రూరల్ ఏఎస్సై సూరయ్య తన సిబ్బందితో కలిసి ఈదులపూసపల్లి శివారులో పెట్రోలింగ్ చేస్తుండగా ఓ వ్యక్తి టీవీఎస్ ఎక్సెల్ పై నాలుగు బస్తాల్లో నల్లబెల్లం తీసుకువెళ్తున్నట్లు గుర్తించారన్నారు. సీత్లాతండ గ్రామానికి చెందిన అజ్మీర రాముపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

### చెరువుకట్ట మరమ్మతులు పూర్తి చేయాలి

కురవి : సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామంలోని చెరువు కట్ట మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇరిగేషన్ ఈఈ సల్మాన్‌రాజు సూచించారు. గ్రామంలోని కొత్తకుంట చెరువు కట్ట గతంలో కురిసిన వర్షాలకు తెగిపోయింది. మరమ్మతు పనులు మంజూరు కాగా కాంట్రాక్టర్ చేపట్టిన పనులను మంగళవారం ఈఈ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం రాకముందే కట్ట పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈ విజయ్‌కుమార్, ఏఈ నిఖిల్, సీరోలు మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేణు ఉన్నారు.

### ఘనంగా గంగాభవాని జాతర



పూజల్లో పాల్గొన్న యాదవ కులస్తులు

మరిపెడ రూరల్ : యాదవుల కులదైవం గంగా భవాని జాతర ఉత్సవాలు మండలంలోని తాళ్లఊకల్‌లో యాదవ కులస్తుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గంగమ్మతల్లికి సాంప్రదాయబద్ధంగా దేవాలయాన్ని ప్రత్యేకంగా అలకరించారు. ప్రత్యేక పూజలు చేసి బోనాలు చెల్లించారు. యాదవకులపెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

### తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె

కురవి: తండ్రికి కూతురు తలకొరివి పెట్టిన సంఘటన మండలంలోని మోద్గులగూడెంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పేరం రమేశ్(37) హైదరాబాద్‌లో పాముకాటుకు గురై సోమవారం మృతి చెందాడు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించగా కుమార్తె త్రివేణి తండ్రికి తలకొరివి పెట్టింది. మృతునికి భార్య కవిత, చిన్నకుమార్తె సింధుకీర్తి ఉన్నారు.

### నిత్యావసర వస్తువుల అందజేత

కేసముద్రం : మున్సిపాలిటీలో వరంగల్‌కి చెందిన సనాతన హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో ఎల్. సునిత, బి.వెంకన్న కుటుంబాలకు నిత్యావసర వస్తువులను మంగళవారం అందజేశారు.

### శ్రీవారికి అభిషేకాలు

మహబూబాబాద్ రూరల్ : పట్టణంలోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో స్వామివారు, అమ్మవార్లకు మంగళవారం అభిషేకాలు నిర్వహించారు.

### మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

కేసముద్రం/పెద్దవంగర: హైదరాబాద్‌లో సచివాలయ ముట్టడి నేపథ్యంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కేసముద్రం, ఇనుగుర్తి, పెద్దవంగర మండలాలకు చెందిన మాజీ సర్పంచ్‌లను మంగళవారం ముందస్తు అరెస్ట్ చేసినట్లు కేసముద్రం ఎస్సై మురళీధర్‌రాజు తెలిపారు. పూచీకత్తుపై విడుదల చేశారు.

### బెల్ట్ షాపులకు మద్యం తరలింపు

మరిపెడ రూరల్: మండల కేంద్రంలో మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి షాపుల్లోని మద్యం అంతా బెల్ట్ షాపులకు అధిక ధరలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని కాంగ్రెస్ మండల యూత్ జనరల్ సెక్రటరీ తేజావత్ అఖిల్‌నాయక్ ఆరోపించారు. అధికారులు స్పందించి బెల్ట్ షాపులను నియంత్రించి వైన్స్‌లో ఎమ్మార్పీకే అందేలా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశాడు.

### రోడ్డుపై ప్రవహిస్తున్న తాగునీరు



డోర్నకల్ : స్థానిక గాంధీసెంటర్ పరిధిలో పైపులు పగిలి నాలుగు రోజులుగా రోడ్డుపై తాగునీరు ప్రవహిస్తోంది. అమృత్ పైప్‌లైన్ ఏర్పాటు కోసం గాంధీసెంటర్‌లో 4 రోజుల క్రితం తవ్వకాలు జరుపుతుండగా తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్ పగలడంతో రోడ్డుపైకి తాగునీరు ప్రవహిస్తుంది. మెయిన్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా అధికారులు పట్టిచుకోవడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.